



# రిపబ్లిక్ హిందుస్థాన్

తెలుగు దినపత్రిక


సంపుటి-1, సంచిక-4, 09-08-2026, ఎడిటర్ : రాథోడ్ రాజు పేజీలు-4, వెల రూ. 4/-

Warangal, Ranga Reddy, Khammam, Nizamabad, Karimnagar, Hyderabad, Mahabubnagar, Visakhapatnam, Kadapa, Vijayawada, Tirupati, Guntur, Kurnool, Nellore, Srikakulam


## డేటింగ్ యాప్‌ల ముసుగులో మోసాల ముప్పు

- పరిచయాల పేరుతో బ్లాక్‌మెయిల్ దందా
- వ్యక్తిగత వివరాలు పంచుకుంటే ప్రమాదమే
- దేశవ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ ఉచ్చులు
- అప్రమత్తతే రక్షణ అంటున్న నిపుణులు



**తెలంగాణ బ్యూరో,(రిపబ్లిక్ హిందుస్థాన్):** డిజిటల్ యుగంలో డేటింగ్ యాప్‌లు, సామాజిక మాధ్యమాలు కొత్త పరిచయాలకు వేదికలుగా మారుతున్నప్పటికీ, వాటి ముసుగులో జరుగుతున్న మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో వెలుగులోకి వచ్చిన ఘటనలో పల్లవి సింగ్ రాజ్‌పుత్ అనే మహిళ డేటింగ్ యాప్‌ల ద్వారా పురుషులతో పరిచయాలు పెంచుకుని, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను అడ్డం పెట్టుకుని కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు రావడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సైబర్ నేరగాళ్లు ఇప్పుడు కొత్త పద్ధతులతో అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. మొదట స్నేహం పేరుతో నమ్మకం సంపాదించి, తర్వాత వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడం, రహస్యంగా చిత్రాలు లేదా వీడియోలు రికార్డు చేయడం, అనంతరం వాటిని బహిర్గతం చేస్తామని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. పరువు నష్టం భయంతో చాలామంది బాధితులు ఫిర్యాదు చేయకుండా మౌనంగా డబ్బులు చెల్లిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

ముఖ్యంగా డేటింగ్ యాప్‌లు, సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వ్యక్తుల గురించి పూర్తి అవగాహన లేకుండానే వ్యక్తిగత వివరాలు, కుటుంబ సమాచారం, బ్యాంకు వివరాలు లేదా వ్యక్తిగత ఫొటోలు పంచుకోవడం ప్రమాదకరంగా మారుతోంది. ఒక్కసారి సమాచారం నేరగాళ్ల చేతికి చేరితే దానిని బ్లాక్‌మెయిలింగ్‌కు ఉపయోగించే అవకాశాలు అధికంగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవలి కాలంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇలాంటి కేసులు నమోదవుతున్నాయి. నకిలీ పేర్లు, తప్పుడు గుర్తింపులతో పరిచయాలు పెంచుకుని మోసాలకు పాల్పడే ముఠాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కొత్త కొత్త మార్గాలు అనుసరిస్తున్నాయి. యువతతో పాటు ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, వృత్తి నిపుణులు కూడా ఈ ఉచ్చుల్లో చిక్కుకుంటున్న ఘటనలు నమోదవుతున్నాయి.

సందేహాస్పదంగా ప్రవర్తించే వ్యక్తులు డబ్బులు అడిగినా, బెదిరింపులకు పాల్పడినా వెంటనే పోలీసులను లేదా సైబర్ క్రైమ్ విభాగాన్ని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. భయపడి డబ్బులు చెల్లించడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తుందని చెబుతున్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవడం, వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకోవడం అత్యంత అవసరమని పేర్కొంటున్నారు. సాంకేతికతను వినియోగించే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అపరిచితులతో వ్యక్తిగత విషయాలు పంచుకోకుండా, ఆన్‌లైన్ పరిచయాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తే ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండవచ్చని చెబుతున్నారు. డిజిటల్ ప్రపంచంలో జాగ్రత్తే ఉత్తమ రక్షణ అని హెచ్చరిస్తున్నారు.



## ఆదివాసీల అస్తిత్వానికి ప్రపంచ వేదిక

**ప్రకృతి సంరక్షణలో అపూర్వ పాత్ర**
**సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ అవసరం**
**సమాన హక్కుల సాధనకు సంకల్పం**



**తెలంగాణ బ్యూరో,(రిపబ్లిక్ హిందుస్థాన్):** ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న ఆదివాసీ ప్రజల హక్కులు, సంస్కృతి, భాషలు, సంప్రదాయాలు, జీవన విధానాల పరిరక్షణకు గుర్తింపుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీ ప్రజల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరుపుకునే ఈ ప్రత్యేక దినం ఆదివాసీ సమాజాల చరిత్ర, వారసత్వం, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రపంచ దృష్టికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఆధునిక నాగరికత వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో కూడా తమ ప్రత్యేక గుర్తింపును కాపాడుకుంటూ జీవిస్తున్న ఆదివాసీ సమాజాలు మానవ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించాయి. ప్రపంచ జనాభాలో సుమారు ఐదు శాతం మాత్రమే ఆదివాసీలు ఉన్నప్పటికీ, భూమిపై ఉన్న సాంస్కృతిక వైవిధ్యంలో వారి పాత్ర అత్యంత ప్రాధాన్యమైనది. ప్రపంచంలోని వేలాది భాషలు, సంప్రదాయాలు, జీవన శైలులు ఆదివాసీ సమాజాల ద్వారా ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. ప్రతి తెగకు ప్రత్యేకమైన ఆచారాలు, పండుగలు, విశ్వాసాలు ఉండడం మానవ నాగరికతకు గొప్ప సంపదగా భావించబడుతోంది. ఈ వారసత్వం కేవలం ఒక సమాజానిదే కాకుండా మొత్తం ప్రపంచానిదని నిపుణులు పేర్కొంటున్నారు.

ఆదివాసీ ప్రజల జీవన విధానం ప్రకృతితో విడదీయరాని బంధాన్ని కలిగి ఉంటుంది. అడవులు, కొండలు, నదులు, వన్యప్రాణులు, ఔషధ మొక్కలు వంటి సహజ వనరులను వారు కేవలం వినియోగించడమే కాకుండా సంరక్షిస్తారు కూడా. ప్రకృతి సమతుల్యతను కాపాడే విషయంలో ఆదివాసీ సమాజాల సంప్రదాయ జ్ఞానం అమూల్యమైనదిగా గుర్తించబడింది. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పర్యావరణ సంక్షోభాల నేపథ్యంలో వారి అనుభవాలు, విధానాలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. భారతదేశంలో ఆదివాసీలు దేశ సాంస్కృతిక నిర్మాణంలో కీలక భాగస్వాములుగా ఉన్నారు. గోండులు, కొయలు, చెంచులు, సవరలు, కొండరెడ్డిలు, లంబాడీలు వంటి అనేక గిరిజన తెగలు తమ ప్రత్యేక జీవన విధానాలను కొనసాగిస్తూ వస్తున్నారు. వారి జానపద కళలు, నృత్యాలు, గీతాలు, హస్తకళలు, సంప్రదాయ వైద్య పద్ధతులు భారతీయ సంస్కృతిని మరింత సమృద్ధిగా చేస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ వారి సంప్రదాయ పండుగలు వైభవంగా నిర్వహించబడుతున్నాయి.

తెలంగాణలో కూడా గిరిజన సమాజాలు రాష్ట్ర సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో గిరిజన జనాభా అధికంగా ఉంది. ఈ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు అడవుల సంరక్షణతో పాటు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. వారి సంప్రదాయ జ్ఞానం ప్రకృతి పరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతోంది. అయితే అభివృద్ధి పేరుతో అనేక ఆదివాసీ ప్రాంతాలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. గనుల తవ్వకాలు, పరిశ్రమలు, భారీ ప్రాజెక్టుల కారణంగా కొన్నిచోట్ల గిరిజన కుటుంబాలు తమ నివాస ప్రాంతాలను కోల్పోవాల్సి వస్తోంది. భూమి హక్కులు, అటవీ హక్కులు, జీవనోపాధి భద్రత వంటి అంశాలు ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ప్రధాన సమస్యలుగా కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితులు ఆదివాసీ సమాజాల అస్తిత్వానికే సవాలుగా మారుతున్నాయి.

విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల విషయంలో కూడా అనేక గిరిజన ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయి. ప్రభుత్వాలు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ, కొండ ప్రాంతాలు మరియు మారుమూల గ్రామాలకు సేవలు పూర్తిస్థాయిలో చేరడం లేదు. విద్యా సదుపాయాల లేమి కారణంగా అనేక మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ఆరోగ్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల కూడా పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆదివాసీ భాషల పరిరక్షణ ప్రస్తుతం అత్యంత కీలకమైన అంశంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా అనేక గిరిజన భాషలు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. భాష కోల్పోతే ఆ సమాజ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయ జ్ఞానం కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే గిరిజన భాషల బోధన, పరిశోధన, ప్రచారం కోసం ప్రత్యేక చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

ఆదివాసీ యువత ప్రస్తుతం విద్య, ఉద్యోగాలు, సాంకేతిక పరిజ్ఞానం వైపు అడుగులు వేస్తున్నప్పటికీ తమ మూలాలను మరచిపోకుండా ముందుకు సాగుతున్నారు. సమాజ అభివృద్ధిలో భాగస్వాములవుతూ, తమ హక్కుల సాధన కోసం చైతన్యవంతంగా పనిచేస్తున్నారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక వర్గాలు కలిసి ఆదివాసీ యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తే వారు దేశ అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించగలరు. అంతర్జాతీయ ఆదివాసీ ప్రజల దినోత్సవం ప్రపంచానికి ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. ప్రకృతిని కాపాడే, సంస్కృతిని సంరక్షించే, సమానత్వాన్ని కోరుకునే ఆదివాసీ సమాజాల హక్కులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరేలా చూడడం, వారి సంస్కృతి, భాషలు, జీవన విధానాలను రక్షించడం ద్వారానే నిజమైన సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆదివాసీల అస్తిత్వాన్ని గౌరవిస్తూ వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడం ఈ దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యంగా నిలుస్తోంది.

## జనసేన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

నిజామాబాద్‌లో ఉత్సాహంగా సమావేశం
పార్టీ బలోపేతంపై నేతల దిశానిర్దేశం
భవిష్యత్ కార్యాచరణపై చర్చ





నిజామాబాద,(రిపబ్లిక్ హిందుస్థాన్): నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల జనసేన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం సుగుణ గార్డెన్స్ వేదికగా ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు మీసాల శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై పోరాటాల అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేసి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాలని కార్యకర్తలకు సూచించారు.ప్రచార కార్యదర్శి సాగర్ ఆర్.కె. నాయుడు మాట్లాడుతూ తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణకు కార్యకర్తల పాత్ర కీలకమని అన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు, ప్రత్యక్ష ప్రచారం ద్వారా పార్టీ భావజాలాన్ని ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ భవిష్యత్ వ్యూహాలపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. యువత, మహిళలు రాజకీయాల్లో మరింత చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.జనసైనికులు, వీరమహిళలు తమ ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యకర్తల సూచనలను పార్టీ నాయకత్వం సానుకూలంగా స్వీకరించింది. సమావేశం అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలతో ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం జనసేన శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు.

## కేసీఆర్ అండతో పెద్ది కుటుంబానికి భరోసా

రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత
పిల్లల భవిష్యత్తుకు చెరో కోటి రూపాయలు
కుటుంబ సంక్షేమానికి బీఆర్ఎస్ భరోసా



హైదరాబాద్,(రిపబ్లిక్ హిందుస్థాన్): స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచింది. పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు కుటుంబానికి మొత్తం రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయం అందజేశారు. సుదర్శన్ రెడ్డి కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆయన ఇద్దరు పిల్లలకు చెరో రూ. 1 కోటి చొప్పున ఆర్థిక సాయం అందించారు. వారి విద్యాభ్యాసం, భవిష్యత్తు అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ సహాయం ఉపయోగపడనుంది.

అదే విధంగా సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ సంక్షేమం కోసం రూ. 25 లక్షలను బ్యాంకులో జమ చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పిల్లల చదువు, ఉన్నత విద్య, భవిష్యత్తు లక్ష్యాల సాధనకు అవసరమైన అన్ని విధాలా సహకారం అందిస్తామని బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టం చేసింది. కుటుంబ సభ్యులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపింది.సుదర్శన్ రెడ్డి కుటుంబం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితుల్లో కేసీఆర్ అందించిన సహాయం వారికి గొప్ప ఊరటనిచ్చిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆర్థిక సహాయంతో పాటు నైతికంగా కూడా కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సంక్షేమం, పిల్లల భవిష్యత్తు రక్షణే ప్రధాన లక్ష్యంగా ఈ సహాయం అందించినట్లు బీఆర్ఎస్ నాయకత్వం వెల్లడించింది. పార్టీ కార్యకర్తలు, నాయకులు కూడా కుటుంబానికి అవసరమైన సహకారం అందించాలని సూచించింది.

# ప్రజలకు అందుబాటులోకి ఎంసీఆర్ టిమ్స్

## – త్వరలో ప్రారంభానికి సన్నాహాలు – మిగిలిన పనులు వేగంగా పూర్తి
## – సూపర్ స్పెషాలిటీ సేవల లక్ష్యం – మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్,(రిపబ్లిక్ హిందుస్థాన్): రాష్ట్ర ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు సిద్ధమవుతున్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థ (ఎంసీఆర్ టిమ్స్) ప్రారంభానికి రంగం సిద్ధమవుతోంది. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం ఆసుపత్రిని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రిని త్వరలోనే ప్రజలకు అంకితం చేయనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించనుందని మంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రారంభానికి ముందు అన్ని విభాగాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలోని ఏ, బీ, సీ బ్లాకులను సందర్శించిన ఆయన, అక్కడ ఏర్పాటు చేసిన వైద్య పరికరాలు, మౌలిక వసతులు, రోగులకు కల్పించనున్న సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, నర్సులు, సిబ్బందితో మాట్లాడి అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అవసరమైన ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రి ప్రారంభమైన మొదటి రోజు నుంచే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా, నీటి వసతి, పారిశుధ్యం, భద్రత, అగ్నిమాపక వ్యవస్థలు, అత్యవసర సేవలు వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని సూచించారు. ఆసుపత్రిలోని ప్రతి విభాగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వైద్య సేవల నిర్వహణకు అవసరమైన మానవ వనరుల కల్పనపై కూడా మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, సాంకేతిక నిపుణులు, పరిపాలనా సిబ్బంది తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులకు వైద్య సేవలతో పాటు అవసరమైన ఇతర సహాయక సేవలు కూడా నిరంతరాయంగా అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

ఎంసీఆర్ టిమ్స్‌ను రాష్ట్రంలో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే ప్రముఖ ప్రభుత్వ వైద్య సంస్థగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అత్యవసర వైద్యం, క్రిటికల్ కేర్, అవయవ మార్పిడి చికిత్సలు, ప్రత్యేక వైద్య విభాగాలు, ఆధునిక పరికరాలతో కూడిన చికిత్సా సేవలు ఒకే వేదికపై అందించేలా ఆసుపత్రిని తీర్చిదిద్దుతున్నామని వివరించారు. దీనివల్ల ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పంలో ఎంసీఆర్ టిమ్స్ కీలక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లోని ఇతర ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గడంతో పాటు సూపర్ స్పెషాలిటీ చికిత్స అవసరమైన వేలాది మంది రోగులకు మెరుగైన వైద్య సేవలు లభిస్తాయని తెలిపారు. ప్రారంభం నుంచే అత్యుత్తమ సేవలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని

# ఎస్ఐఆర్ ప్రక్రియపై బీజేపీ దృష్టి

### అర్హులైన ఓటర్ల నమోదుకు పిలుపు
### అక్రమ నమోదులపై అప్రమత్తంగా ఉండాలని సూచన
### హైదరాబాద్‌లో ఎస్ఐఆర్ వర్క్‌షాప్ నిర్వహణ




హైదరాబాద్,(రిపబ్లిక్ హిందుస్థాన్):రాష్ట్రంలో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) రెండో విడత ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు మరింత అప్రమత్తంగా పనిచేయాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ వర్క్‌షాప్‌లో ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బీజేపీ కార్యకర్తలు అహర్నిశలు శ్రమిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేస్తున్నారని రామచందర్ రావు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి సరైన ఓటరు జాబితా అత్యంత కీలకమని అన్నారు.

తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమ వ్యక్తులకు వెనుకద్వార మార్గం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ల జారీ అనేక అనుమానాలకు తావిస్తోందని రామచందర్ రావు పేర్కొన్నారు. అక్రమ వ్యక్తులకు చట్టబద్ధత కల్పించే ప్రయత్నంగా ఇది కనిపిస్తోందని ఆరోపించారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయడంతో పాటు, అనుమానాస్పదమైన లేదా అనర్హమైన నమోదులను క్షుణ్ణంగా పరిశీలించాలని కార్యకర్తలకు సూచించారు. ఓటరు జాబితా స్వచ్ఛతను కాపాడేందుకు మరింత వేగంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కిషన్ రెడ్డి, రఘునందన్ రావు, గోడం నగేశ్‌తో పాటు బీజేపీ తెలంగాణకు చెందిన పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు.

# నీట్ విద్యార్థుల రిజిస్ట్రేషన్‌కు నోటిఫికేషన్




తెలంగాణ బ్యూరో,(రిపబ్లిక్ హిందుస్థాన్): నీట్- 2026లో అర్హత సాధించిన విద్యార్థుల రిజిస్ట్రేషన్ కోసం కాళోజీ హెల్త్ యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు రిజిస్ట్రేషన్ ఈ నెల 5 ఉదయం 6 నుంచి 12వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో సర్టిఫికెట్‌లు అప్‌లోడ్ చేసుకోవాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నాగార్జునరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రిజిస్ట్రేషన్ సమయంలో నీట్ ర్యాంక్ కార్డుతోపాటు బర్త్ సర్టిఫికెట్, ఇంటర్ లేదా 10o2 విద్యార్హతల సర్టిఫికెట్లు, స్టడీ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ అర్హత కలిగిన విద్యార్థులు 2026-27 వార్షిక సంవత్సరానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, ఇతర అర్హత ఉన్న విద్యార్థులు ప్రభుత్వం అనుమతించిన కోటాలో సీటు పొందడానికి ఆయా సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.4 వేలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.3,200 నాన్ రిఫండబుల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, ఈ ఫీజును డెబిట్ లేదా క్రెడిట్ కార్డు ద్వారా మాత్రమే స్వీకరిస్తారని తెలిపారు.యూనివర్సిటీ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ కోసం 7901098840, 9490585796, టెక్నికల్ సమస్యల పరిష్కారమార్గాల కోసం 9392685856, 9095672216, 7842136688, ఫీజు చెల్లింపుల కోసం 9618240276, వెరిఫికేషన్ సమస్యల పరిష్కారం కోసం 9866092370 ఫోన్ నంబర్లలో కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించవచ్చని వెల్లడించారు.

# సాగునీటి ప్రాజెక్టులకు వేగం

- రూ.5,000 కోట్ల నిధులకు సీఎం హామీ
- భూసేకరణ, పునరావాస పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం
- మిడ్ మానేరు ఎడమ కాలువ పనులు పునఃప్రారంభానికి చర్యలు
- పతిపాక జలాశయ డీపీఆర్ ఆగస్టు నెలాఖరులోపు సిద్ధం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ ,(రిపబ్లిక్ హిందుస్థాన్): రాష్ట్రంలో నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులకు మళ్లీ వేగం తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు వంటి కారణాలతో ఆలస్యమవుతున్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.5,000 కోట్ల నిధులను ప్రాధాన్య క్రమంలో కేటాయించేందుకు హామీ ఇచ్చినట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇందులో ఇప్పటికే రూ.2,000 కోట్లు విడుదల కాగా, మిగిలిన రూ.3,000 కోట్లు విడుదల ప్రక్రియలో ఉన్నాయని వెల్లడించారు. నిధుల కొరత కారణంగా ఏ ప్రాజెక్టు పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సామాజిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు.

భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతులు వంటి పెండింగ్ అంశాలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల వల్ల ప్రభావితమయ్యే కుటుంబాలకు పరిహారం చెల్లింపులు, పునరావాస కార్యక్రమాలు ఇంజినీరింగ్ పనులతో సమాంతరంగా కొనసాగాలని సూచించారు. అవసరమైన నిధుల వివరాలను వెంటనే సమర్పించి ఆమోదాలు పొందాలని కలెక్టర్లకు సూచించారు. రైతులకు త్వరగా సాగునీటి ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని తెలిపారు. సమీక్షలో ప్రధానంగా మిడ్ మానేరు ఎడమ కాలువ ప్రాజెక్టు అంశం చర్చకు వచ్చింది. గత నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన ఈ పనులను తక్షణమే పునఃప్రారంభించేందుకు అవసరమైన భూసంబంధిత సమస్యలను పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. సవరించిన అంచనాలు, టెండర్లు, భూసేకరణ, చట్టపరమైన అనుమతుల ప్రక్రియలను ఒకేసారి ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని అధికారులు వివరించారు.

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పతిపాక జలాశయ ప్రాజెక్టుపై కూడా సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. 3 టీఎంసీలు, 5 టీఎంసీల సామర్థ్యాలతో రెండు ప్రత్యామ్నాయ నమూనాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. లిడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ పూర్తయ్యాయని, భూగర్భ పరిశోధనలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆగస్టు నెలాఖరులోపు డీపీఆర్ సమర్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు కాకతీయ ప్రధాన కాలువ పరిధిలోని సుమారు 2.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ కల్పించనున్నారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టుపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 96 శాతం పనులు పూర్తయ్యాయని, అటవీ అనుమతుల కారణంగా మిగిలిన పనులు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ అటవీకరణ కోసం భూమి గుర్తింపు పూర్తయ్యిందని, వన్యప్రాణి సంరక్షణ ప్రణాళికకు కూడా ఆమోదం లభించిందని వెల్లడించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ, పునరావాసం, అటవీ, పర్యావరణ అనుమతుల పెండింగ్ అంశాల జాబితాను సిద్ధం చేసి, వాటి పరిష్కారానికి గడువులు నిర్ణయించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి ద్వారా రైతులకు శాశ్వత ప్రయోజనాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# హైడ్రా పోస్టుల కోసం వేలాది మంది

**- డీఆర్ఎఫ్ అసిస్టెంట్ పోస్టులకు భారీ స్పందన- సరూర్‌నగర్ స్టేడియంలో వేలాది మంది అభ్యర్థులు**
**- పోలీసుల సహకారంతో సజావుగా ఎంపికలు- అందరికీ అవకాశం కల్పిస్తామని హామీ**



హైదరాబాద,(రిపబ్లిక్ హిందుస్థాన్): హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) అసిస్టెంట్, డ్రైవర్ ఉద్యోగాల నియామక ప్రక్రియకు యువత నుంచి విశేష స్పందన లభించింది. 100 మంది డీఆర్ఎఫ్ అసిస్టెంట్లు, 50 మంది డ్రైవర్ల నియామకానికి సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన ఎంపికల కోసం వేలాది మంది అభ్యర్థులు హాజరుకావడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. హైడ్రా అధికారులు ఇప్పటికే ఆగస్టు 8, 9 తేదీల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు ప్రకటించడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మూడు వేల మందికి పైగా అభ్యర్థులు ఒకేసారి చేరుకోవడంతో దరఖాస్తుల స్వీకరణ, టోకెన్ల పంపిణీ, శారీరక పరీక్షల నిర్వహణలో ప్రారంభ దశలో కొంత ఇబ్బంది తలెత్తింది.

అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ఒకేసారి ముందుకు రావడంతో పరిస్థితిని నియంత్రించేందుకు అధికారులు, పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ఈ క్రమంలో ఒక అధికారి అసహనానికి గురై పరుష వ్యాఖ్యలు చేసిన ఘటన చోటుచేసుకున్నప్పటికీ అనంతరం పరిస్థితిని వివరించి అభ్యర్థులను సముదాయించారు. యువత కూడా పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎంపికల ప్రక్రియ కొనసాగింది. తొక్కిసలాటలకు ఆస్కారం లేకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వరుసల వారీగా దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. శారీరక పరీక్షలకు హాజరయ్యే ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పిస్తామని అధికారులు పదేపదే లౌడ్‌స్పీకర్ల ద్వారా ప్రకటించారు.

దరఖాస్తుదారులందరి వివరాలను నమోదు చేసి టోకెన్లు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. నియామకాలపై యువతలో ఉన్న ఆసక్తి కారణంగా భారీ సంఖ్యలో అభ్యర్థులు తరలివచ్చారని అధికారులు పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం పోటీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ విభాగాల్లో వెలువడుతున్న ప్రతి నియామక ప్రకటనకు విశేష స్పందన కనిపిస్తోందన్నారు. యువత సహకారం, పోలీసుల సమన్వయం వల్ల ఎంపికల ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని హైడ్రా అధికారులు తెలిపారు. మిగిలిన పరీక్షలను కూడా పారదర్శకంగా నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. హైడ్రా విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయని పేర్కొన్నారు.

# రోడ్డు భద్రతపై సూచనలు

## మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
## డయల్-112 సేవల వినియోగంపై వివరాలు
## ప్రజలతో ముఖాముఖి మాట్లాడిన పోలీసులు



జమ్మలమడుగు,(రిపబ్లిక్ హిందుస్థాన్): ప్రజల్లో భద్రతా అవగాహన పెంపొందించడం, నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం లక్ష్యంగా కడప జిల్లా జమ్మలమడుగు పట్టణంలోని పాలగాడి సెంటర్‌లో పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది పాలగాడి సెంటర్‌ను సందర్శించి స్థానిక ప్రజలు, వ్యాపారులు, వాహనదారులతో నేరుగా మాట్లాడారు. రోజువారీ జీవితంలో పాటించాల్సిన భద్రతా చర్యలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, ఆన్‌లైన్ లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని ప్రజలకు సూచించారు. అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-112 సేవలను వినియోగించుకోవచ్చని అధికారులు వివరించారు. ప్రమాదాలు, నేరాలు, ఇతర అత్యవసర సందర్భాల్లో తక్షణ సహాయం అందించేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, వారి భద్రత కోసం శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజల సహకారం లేకుండా నేరాల నియంత్రణ పూర్తిస్థాయిలో సాధ్యం కాదని పోలీసులు అభిప్రాయపడ్డారు. ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాల గురించి వెంటనే సమాచారాన్ని అందించాలని కోరారు. ప్రజలు మరియు పోలీసుల మధ్య సమన్వయం పెరిగితే శాంతిభద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి స్థానిక ప్రజలు మంచి స్పందన ఇచ్చారు. పోలీసులు అందించిన సూచనలను ఆసక్తిగా విన్న ప్రజలు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలను తరచూ నిర్వహించడం ద్వారా ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధితో... బాధితులకు అండ



పొన్నూరు,(రిపబ్లిక్ హిందుస్థాన్):వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మెరుగైన వైద్య చికిత్సల కోసం ఆర్థిక సహాయం కోరిన చేబ్రోలు మండలానికి చెందిన 20 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సాయాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో విడుదలైన మొత్తం రూ.12,61,930 విలువైన చెక్కులను బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందే సమయంలో భారీ వైద్య ఖర్చులను భరించడం కష్టసాధ్యమవుతుందని, అలాంటి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తోందని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం అనేక కుటుంబాలకు ఆర్థిక ఊరటనిస్తోందని తెలిపారు.

ఈ విడతలో వీరణాయకునిపాలెంకు చెందిన భోధనంపాటి కొండయ్య, శలపాడుకు చెందిన నాగవెంకట జనార్ధనరావు, వడ్లమూడికి చెందిన షేక్ హసీనా, సయ్యద్ బాజీ, బేబీ ఆఫ్ షేక్ నూర్ హే హప్సా, సుద్దపల్లికి చెందిన తోట నాగేశ్వరరావు, చేబ్రోలు హిమబిందు, మట్టుపల్లి నాగమ్మ, వేజండ్లకు చెందిన షేక్ చాన్ బి, గుండవరానికి చెందిన చందనం ధన వెంకట సాయి, యలవర్తి వరలక్ష్మి తదితరులు సహాయం పొందారు. అలాగే చేబ్రోలుకు చెందిన కల్లగుంట వీరాంజనేయులు, గంజికుంట హేమలత, పఠాన్ కరిముల్లా బాబా, తాడేపల్లి గోపీనాథ్, బేబీ అనూష, కల్లూరి కుసుమ కుమారి, పసుపులేటి ఆనందరావు, రావూరి నారాయణ, చుక్కా సీతారామయ్యలకు కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సహాయం ద్వారా తమ వైద్య చికిత్సలకు అవసరమైన ఖర్చులు సమకూరనున్నాయని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

# గంజాయి నిర్మూలనకు తిరుపతి పోలీసుల ప్రత్యేక చర్యలు

## మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్న పోలీసులు
## డీజీపీ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు
## యువతను వ్యసనాల బారిన పడకుండా అవగాహన

తిరుపతి,(రిపబ్లిక్ హిందుస్థాన్): రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా పోలీసులు మరింత దూకుడుగా చర్యలు చేపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు పర్యవేక్షణలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం విస్తృత స్థాయిలో తనిఖీలు, నిఘా చర్యలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి వినియోగం, అక్రమ రవాణాపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయని పోలీసులు వివరిస్తున్నారు.

అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తూ, మాదకద్రవ్యాల సరఫరా గొలుసును ఛేదించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో పలువురు నేరస్థులపై కఠిన చర్యలు తీసుకున్న పోలీసులు, పునరావృతంగా నేరాలకు పాల్పడుతున్న వారిపై నిర్బంధ చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని జిల్లా పోలీసు యంత్రాంగం పేర్కొంది. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతోంది. గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగంపై సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు హామీ ఇస్తున్నారు.

గత కొంతకాలంగా తిరుపతి జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గంజాయి రవాణాపై అనేక కేసులు నమోదు చేయడంతో పాటు భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఇటీవల స్వాధీనం చేసిన మాదకద్రవ్యాలను ధ్వంసం చేసి తమ కట్టుదిట్టమైన వైఖరిని చాటారు. జిల్లాను పూర్తిగా మాదకద్రవ్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. డీజీపీ ఆదేశాలతో చేపడుతున్న ఈ ప్రత్యేక కార్యాచరణలో భాగంగా పోలీసు శాఖతో పాటు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు కూడా భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. యువత భవిష్యత్తును కాపాడటమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని, మాదకద్రవ్యాలపై సమిష్టి పోరాటంతోనే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని పోలీసులు పేర్కొన్నారు.




# వ్యసనాల నిర్మూలనతోనే వికసిత్ భారత్

## యువతకు మాదకద్రవ్యాలపై హెచ్చరిక
## నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో సత్యకుమార్ యాదవ్
## ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన

ధర్మవరం,(రిపబ్లిక్ హిందుస్థాన్): శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమాజాభివృద్ధికి యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సిగరెట్, గుట్కా, మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు వ్యక్తిగత ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తాయని మంత్రి తెలిపారు. వ్యసనాల బారిన పడిన వ్యక్తి జీవితంలో ఆర్థిక, సామాజిక, మానసిక సమస్యలు పెరుగుతాయని చెప్పారు. అందువల్ల యువత చిన్న వయస్సు నుంచే మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు.

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే యువత ఆరోగ్యకర జీవనశైలిని అవలంబిస్తూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, బాధ్యత, సృజనాత్మకత వంటి విలువలు యువతలో పెరగాలని సూచించారు. దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని వివరించారు. వ్యసన రహిత సమాజ నిర్మాణం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంస్థలు కలిసి యువతను సరైన దారిలో నడిపించాలని కోరారు. మాదకద్రవ్యాల ప్రమాదాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని చెప్పారు.

బ్రహ్మకుమారి సంస్థలు నిర్వహిస్తున్న నైతిక విలువలు, ఆధ్యాత్మిక చైతన్య కార్యక్రమాలు యువతలో మంచి ఆలోచనలను పెంపొందించేందుకు దోహదపడుతున్నాయని మంత్రి అభినందించారు. యువతలో ఆత్మవిశ్వాసం, మానసిక దృఢత్వం పెరగడం ద్వారా వ్యసనాలకు దూరంగా ఉండే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. వ్యసనాల నుంచి యువతను దూరంగా ఉంచి వారికి మంచి భవిష్యత్తును అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన యువశక్తే బలమైన దేశానికి పునాది అని పేర్కొంటూ, వ్యసన రహిత సమాజ నిర్మాణమే అభివృద్ధి చెందిన భారత లక్ష్య సాధనకు మార్గమని తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి ప్రతినిధులు, విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నార



# భక్తులతో మమేకమైన హోంమంత్రి



విశాఖపట్నం,(రిపబ్లిక్ హిందుస్థాన్): ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత రిషికొండలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక ప్రశాంతతను అనుభవించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు హోంమంత్రి వెల్లడించారు. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం కూడా ప్రత్యేకంగా ప్రార్థనలు చేసినట్లు పేర్కొన్నారు. దర్శనం అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులతో హోంమంత్రి మమేకమయ్యారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని కొంతసేపు ఆత్మీయంగా మాట్లాడారు. ఆలయానికి వచ్చే భక్తులకు అందుతున్న సౌకర్యాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

ఆలయ దర్శన ఏర్పాట్లు, భక్తులకు అందుతున్న సేవల గురించి కూడా భక్తులను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. భక్తుల సూచనలు, అభిప్రాయాలు తెలుసుకోవడం ఆనందంగా అనిపించిందని పేర్కొన్నారు. ప్రజాసేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగేందుకు స్వామివారి ఆశీస్సులు కోరుకున్నట్లు అనిత తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తానని పేర్కొన్నారు. రిషికొండ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్యాత్మికంగా విశిష్ట స్థానం కలిగి ఉందని, అక్కడి ప్రశాంత వాతావరణం భక్తులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుందని హోంమంత్రి అన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, భక్తులు ఆమెకు స్వాగతం పలికారు.

# మూడో రోజుకు చేరిన డీఎస్సీపై దీక్షలు

ప్రొద్దుటూరు ,(ప్రజానేత్ర): డీఎస్సీ నియామకాలలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ప్రొద్దుటూరులో మూడో రోజుకు చేరుకున్నాయి. మునిసిపల్ కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట కొనసాగుతున్న ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ ఈ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టింది. నిరుద్యోగుల




భవిష్యత్తుతో ముడిపడిన ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని పార్టీ నేతలు డిమాండ్ చేశారు. నియామకాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలంటే స్వతంత్ర సంస్థతో విచారణ జరపాల్సిందేనని పేర్కొన్నారు.

శనివారం జరిగిన దీక్షలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు మహిళా నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు. ప్రభుత్వం యువత ఆశలను వమ్ము చేసిందని ఆరోపిస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా సిద్ధమవుతున్న అభ్యర్థులకు న్యాయం జరగాలని కోరారు. దీక్షలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య రాష్ట్రంలో తీవ్రమవుతోందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి యువతలో ఉన్న అనుమానాలను తొలగించాలని కోరారు.

డీఎస్సీ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని ప్రజాస్వామ్య మార్గాల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రిలే నిరాహార దీక్షలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, నిరుద్యోగ యువత సంఘీభావం తెలిపారు. మూడో రోజు కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళనలు కొనసాగుతాయని నిర్వాహకులు వెల్లడించారు.ం

## గంజాయి నిర్మూలనకు తిరుపతి పోలీసుల ప్రత్యేక చర్యలు

తిరుపతి,(రిపబ్లిక్ హిందుస్థాన్): రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా పోలీసులు మరింత దూకుడుగా చర్యలు చేపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు పర్యవేక్షణలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం విస్తృత స్థాయిలో తనిఖీలు, నిఘా చర్యలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి వినియోగం, అక్రమ రవాణాపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయని పోలీసులు వివరిస్తున్నారు.

అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తూ, మాదకద్రవ్యాల సరఫరా గొలుసును ఛేదించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో పలువురు నేరస్థులపై కఠిన చర్యలు తీసుకున్న పోలీసులు, పునరావృతంగా నేరాలకు పాల్పడుతున్న వారిపై నిర్బంధ చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని జిల్లా పోలీసు యంత్రాంగం పేర్కొంది. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతోంది. గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగంపై సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు హామీ ఇస్తున్నారు.

గత కొంతకాలంగా తిరుపతి జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గంజాయి రవాణాపై అనేక కేసులు నమోదు చేయడంతో పాటు భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఇటీవల స్వాధీనం చేసిన మాదకద్రవ్యాలను ధ్వంసం చేసి తమ కట్టుదిట్టమైన వైఖరిని చాటారు. జిల్లాను పూర్తిగా మాదకద్రవ్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. డీజీపీ ఆదేశాలతో చేపడుతున్న ఈ ప్రత్యేక కార్యాచరణలో భాగంగా పోలీసు శాఖతో పాటు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు కూడా భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. యువత భవిష్యత్తును కాపాడటమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని, మాదకద్రవ్యాలపై సమిష్టి పోరాటంతోనే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని పోలీసులు పేర్కొన్నారు

# చైర్మన్‌ను పరామర్శించిన సీఎం

## తాడేపల్లిలో నివాసానికి వెళ్లిన చంద్రబాబు
## అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా



తాడేపల్లి,(రిపబ్లిక్ హిందుస్థాన్): ఇటీవల అస్వస్థతకు గురై చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. తాడేపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వైద్యుల సూచనలను అనుసరిస్తూ విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. బ్రహ్మం చౌదరి ఆరోగ్యం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న చంద్రబాబు, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో కోలుకుని మళ్లీ ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బ్రహ్మం చౌదరికి ధైర్యం చెప్పారు. ఆరోగ్య సమస్యలను అధిగమించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. మానసికంగా దృఢంగా ఉండాలని, కుటుంబ సభ్యులు కూడా ధైర్యంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధుల ఆరోగ్యం కూడా ముఖ్యమని చంద్రబాబు పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రజా సేవలో ఉన్నవారు ఆరోగ్యంగా ఉంటేనే సమాజానికి మరింత సేవ చేయగలరని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి పరామర్శకు బ్రహ్మం చౌదరి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బిజీ షెడ్యూల్ మధ్య తమ ఇంటికి వచ్చి పరామర్శించడం తమకు ధైర్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఆరోగ్య పరిస్థితిపై సీఎం వ్యక్తిగతంగా ఆరా తీయడం తమకు సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ పరామర్శ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా హాజరయ్యారు. బ్రహ్మం చౌదరి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజా సేవలో పాల్గొనాలని వారు ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపిన ఆప్యాయత, పరామర్శ అందరిలో సానుకూల స్పందన కలిగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# రూ. కోట్ల విలువైన ఫోన్ల రికవరీ

## కామారెడ్డి పోలీసుల చొరవ
## ఇప్పటిదాకా రూ. 8 కోట్లకు పైగా ఫోన్లు రికవరీ

కామారెడ్డి, ఆగస్టు 8: సెల్‌ఫోన్ల రికవరీలో కామారెడ్డి పోలీసులు ముందుంటున్నారు. చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న ఫోన్లను ఎప్పటికప్పుడు రికవరీ చేస్తూ సంబంధీకులకు అందిస్తున్నారు. బాధితులు పోగొట్టుకున్న ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ సాయంతో వెతికి పట్టుకుని తిరిగి అప్పగిస్తున్నారు. సీఈఐఆర్ పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు రూ. 8.44 కోట్ల విలువైన ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందించామని కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర శనివారం తెలిపారు.




**పోర్టల్ సాయంతో**

గతంలో సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా ఇక అంతే సంగతి. పోలీసులకు ఫిర్యాదు చేసినా పెద్దగా ఫలితం ఉండక పోయేది. అయితే, ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు కేంద్ర టెలికాం శాఖ సీఈఐఆర్ పోర్టల్‌ను తీసుకొచ్చింది. సెల్‌ఫోన్ పోయిన బాధితులు ఫిర్యాదు చేయగానే పోలీసులు రంగంలోకి దిగుతున్నారు. టెక్నాలజీని ఆధారంగా చేసుకుని ఆయా ఫోన్లను రికవరీ చేస్తున్నారు.

**ఏడాదిలోనే దాదాపు వెయ్యి ఫోన్లు రికవరీ**

కామారెడ్డి జిల్లాలో ఫోన్లు పోగొట్టుకున్న వేలాది మందికి పోలీసులు అండగా నిలిచారు. ఏడాది వ్యవధిలో రూ. 1.59 కోట్ల విలువైన 994 ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. తాజాగా 20 రోజుల వ్యవధిలో 150 ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ రాజేశ్‌చంద్ర తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా ఆందోళన చెందవద్దని, సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చన్నారు. ఈ పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు రూ. 8.44 కోట్ల విలువైన ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందించామని వెల్లడించారు. గత రోజుల్లో సుమారు రూ. 32 లక్షల విలువైన 150 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఫోన్ల రికవరీ కోసం ఇన్‌స్పెక్టర్ సంపత్ పర్యవేక్షణలో, ఆర్ఎస్సై బాలరాజు, ఐదుగురు కానిస్టేబుళ్లతో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు రికవరీ చేసిన ఫోన్ల వివరాలను బాధితులకు తెలియజేశామని, వారు జిల్లా పోలీసు ఆఫీస్‌కు వచ్చి ఆర్ఎస్సై బాలరాజ్ (87126 86114)ను సంప్రదించి, సంబంధిత వివరాలు చూపించి ఫోన్లు తీసుకోవాలని సూచించారు. ఫోన్ పోయిన వెంటనే ప్రజలు సంబంధిత ఠాణాలో ఫిర్యాధు చేయడంతో పాటు సిమ్‌కార్డును బ్లాక్ చేయాలని కోరారు. మొబైల్ ద్వారానే సైబర్ మోసాలు జరిగే అవకాశం ఉందన్నారు.

# తాజ్‌మహల్‌లో భద్రతా మాక్ డ్రిల్



ఆగ్రా,(రిపబ్లిక్ హిందుస్థాన్): రానున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో తాజ్‌మహల్ వద్ద భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్ఠం చేసేందుకు బహుళ విభాగాల సమన్వయంతో ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆగ్రాలోని తాజ్‌మహల్ సీఐఎస్ఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న ఈ విన్యాసాలు చేపట్టారు. అత్యవసర పరిస్థితుల్లో వివిధ శాఖల ప్రతిస్పందన సామర్థ్యాన్ని అంచనా వేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు. మాక్ డ్రిల్‌లో భాగంగా ఉగ్రవాదులు ఆయుధాలతో దాడి చేసినట్లుగా ఒక కల్పిత పరిస్థితిని సృష్టించారు. ఆ పరిస్థితిలో భద్రతా బలగాలు ఎలా స్పందించాలి, పర్యాటకులను ఎలా రక్షించాలి, ప్రాంతాన్ని ఎలా నియంత్రణలోకి తీసుకురావాలనే అంశాలపై సాధన నిర్వహించారు. సంఘటన జరిగిన వెంటనే భద్రతా సిబ్బంది చేపట్టాల్సిన చర్యలను ప్రత్యక్షంగా అమలు చేసి చూపించారు.దాడి అనంతరం అనుమానాస్పద పేలుడు పదార్థం ఉన్నట్లు భావించి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. బాంబు నిర్వీర్య దళాలు, శునక దళాలు రంగంలోకి దిగి ప్రాంతాన్ని పూర్తిగా పరిశీలించాయి. అనుమానాస్పద వస్తువులను గుర్తించడం, వాటిని సురక్షితంగా నిర్వీర్యం చేయడం వంటి ప్రక్రియలను విజయవంతంగా ప్రదర్శించారు. ఈ విన్యాసాల్లో సీఐఎస్ఎఫ్, ఉత్తరప్రదేశ్ పోలీసులు, పురావస్తు శాఖ నిర్వహణ విభాగం, అగ్నిమాపక శాఖ, బాంబు నిర్వీర్య దళాలు, శునక దళాలు, ప్రత్యేక భద్రతా సిబ్బంది, స్థానిక నిఘా విభాగం, వైద్య బృందాలు పాల్గొన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసే విధానాన్ని పరీక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశంలోని కీలక ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయడంలో ఇటువంటి మాక్ డ్రిల్‌లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.



## ఎన్‌యూసీఎఫ్‌డీసీ నూతన కార్యాలయ ప్రారంభం



ముంబై: జాతీయ పట్టణ సహకార ఆర్థిక, అభివృద్ధి సంస్థ (ఎన్‌యూసీఎఫ్‌డీసీ) నూతన కార్యాలయ భవనాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం ముంబైలో ప్రారంభించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సహకార రంగ అభివృద్ధికి ఈ సంస్థ కీలకంగా మారనుందని నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, కేంద్ర సహాయ మంత్రులు కృష్ణపాల్ గుర్జర్, మురళీధర్ మొహోల్, రాష్ట్ర మంత్రులు బాబాసాహెబ్ పాటిల్, ఆశిష్ షెలార్, ఎన్‌యూసీఎఫ్‌డీసీ చైర్మన్ జ్యోతీంద్ర మెహతాతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. నూతన కార్యాలయ భవనం ద్వారా సంస్థ కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం కలుగుతుందని వారు పేర్కొన్నారు.